మరదల్ని మోసగించి
ఆమె డబ్బు కాజేసిన
అతనికి కనువిప్పు
ఎలా కలిగింది?

డా. ఎ. సుబ్బారావ్ కథ

# శకునపక్షి


బెంగుళూరునుంచి సాయంకాలం 5 గంటలకి వచ్చి సామానులని కాటేజీలో పడేసి, కాస్సేపు అడవిలో తిరిగి వచ్చి చతికిల పడ్డారు మిత్రబృందం. కాస్త ఒళ్ళున్న వెంకటరెడ్డికి బుడ్డీ అన్నా, చికెన్ అన్నా తెగ ఇష్టం. ఆర్థికంగా ఇబ్బందిలేని రాజు, ఎక్బోటే, వెంకటరెడ్డిలు శర్మతో వేసవి కాలం సరదాగా 4, 5 రోజులు గడపడానికి కాటేజీకివస్తారు. ఊయూరు ఫైనాన్స్ కంపెనీ నడిపే వెంకటేశ్వర్లు ఉత్సాహం చూపించగా తమతో తీసుకువచ్చారు. శర్మ ఐస్‌బాక్స్‌లోంచి మందు ఎప్పుడు తీస్తాడా? అని ఎదురుచూడసాగేరు అందరూ. కార్యక్రమం మెల్లిగా ప్రారంభం అయింది. 7 గంటలకి ఒక రౌండ్ పూర్తయింది.

శర్మ విదేశీ మందు, వాయుమేఘాల మీదకి తీసుకెళ్తుంది అన్నావు. రెండు రౌండ్లు పూర్తవుతున్నాయి. ఏదీ ఇంకా నాలో ఏమీ చలనమే రాలేదు. దాని మాట అలా ఉంచు, చికెన్ ఏదీ?' అనడిగేడు గ్లాసుని ఖాళీ చేస్తూ వెంకటరెడ్డి.

''మా అప్పారావుకి ఆ పని అప్పగించేను. చికెన్ వస్తుంది. కాస్త నిదానించు. రాత్రంతా ముందుంది'' అని సమాధానపరిచేడు శర్మ.

''ఏం వస్తుందో ఏమో! అప్పటికి మనం ఈ సీసా ఖాళీ చేసేస్తాం'' అని విచారంగా ఖాళీ అవుతున్న సీసా వంక చూసేడు ఎక్బోటే.

''మరేం భయపడకండి. ఐస్‌బాక్స్‌లో ఇంకా రెండు సీసాలున్నాయి'' అని శర్మ అభయమిచ్చేడు. ఎక్బోటే, వెంకటరెడ్డిలు



స్థిమితపడ్డారు.

"నువ్వు అన్నట్లు ఇక్కడ ఎప్పుడూ ప్రశాంతంగానే ఉంటుంది" అన్నాడు రాజు బయట ఉన్న చెట్లని చూస్తూ.

మన రాజమండ్రి వాతావరణానికీ, ఇక్కడకీ చాలా తేడా వుంది. ఆ గుబురుగా పెరిగిన మొక్కలని చూడండి, ఎంత దట్టంగా ఉన్నాయో! ఎంత పొడుగు ఎదిగే

యో ఆ చెట్లు! కొండ వెనకాలకి సూర్యుడు పారిపోతున్నా తన ప్రతిభని ఆకాశం మీద ఎలా వదిలి వెళ్ళేడో! ఎంత అందంగా ఉందో ఆ కుంకుమ రంగు! ఎర్రని గార్డెన్ సిల్క్ చీర కట్టిన కావ్య నాయికలా లేదు ఆ మేఘం? హా! 3000 అడుగుల ఎత్తులో ఉన్న ఈ పరిసరాలని వదిలి వెళ్ళాలనిపించదు నాకు ఎప్పుడూ. నేను చేసిన మంచి పనులలో ఈ కాటేజి కొనడం ఒకటి'' అన్నాడు శర్మ పశ్చిమ దిశగా చూస్తూ.

''మీకేమిటి కావాలంటే ఇక్కడే ఉండిపోవచ్చు'' అన్నాడు వెంకటేశ్వర్లు.

''కలప వ్యాపారం కోసం ఇక్కడికి వస్తాను కాని శాశ్వతంగా ఇక్కడ ఉండడానికి వీలవదు'' అని సమాధానం చెప్పేడు శర్మ. సంభాషణ మందకొడిగా సాగుతోంది. దేశంలో అరాచక పరిస్థితులమీద, సాల్మన్‌రష్డీ నవల మీదనుంచి శ్రీదేవి అందం మీదకి మళ్ళింది ఉన్నట్టుండి.

''నీకు శాపాలమీద నమ్మకం ఉందా?'' అనడిగేడు ఎక్స్ఛేంట్ రాజుని.

''నాన్సెన్స్. నేన్నమ్మను. అదంతా ట్రాష్'' అన్నాడు రాజు రెండవ రౌండ్ గ్లాస్ ఖాళీ చేసి పైపులో ఉన్న పొగాకు ముట్టిస్తూ.

''ఏం ఎందుకు నమ్మరు? నువ్వు ఖచ్చితంగా చెప్పగలవా వాటి ప్రభావం లేదని?' అని రెట్టించేడు రామమూర్తి.

''మీ ఉద్దేశ్యమేమిటి వెంకటేశ్వర్లుగారూ? ఉసురుకొట్టడం లాంటివి నమ్ముతారా? లేక అదంతా ట్రాష్ అంటారా?'' అనడిగేడు శర్మ.

''దీని గురించి ప్రత్యేకంగా నేను ఎప్పుడూ ఆలోచించలేదు. కాని మా ఆవిడ శనివారాలు చేస్తుంది'' అని కళ్ళు మూసుకుంటూ, మత్తులోనికి కరుగుతూ సమాధానం చెప్పేడు వెంకటేశ్వర్లు.

వెంకటేశ్వర్లు సమాధానం ఎవరికీ అర్థమవలేదు. డ్రింక్ మహత్తు! అనుకుని అందరూ నవ్వుకున్నారు.

''ఎందుకో తెలియదు. లాజిక్ అడగకండి. మనం ఎవరికైనా తీరని ద్రోహం చేస్తే దాని ఉసురు తనకి తగిలి తీరుతుంది అని నా నమ్మకం'' అని అందరి వైపు చూసేడు శర్మ. ఎవ్వరూ మాట్లాడలేదు.

చీకటి పడబోతుంది. అప్పారావు జాడలేదు. శర్మ లోపలికి వెళ్ళి ప్లేట్లలో జీడిపప్పు, పకోడీలతో తిరిగి వచ్చి ''అయామ్ సారీ, ఎందుకో నా మనసు కీడుని శంకిస్తోంది. అప్పారావుకి ఏమయిందబ్బా? మళ్ళీ వాడికి దెబ్బలు కాని తగలలేదు కదా?'' అన్నాడు.

''ఒరేయ్! చంపేస్తాను అలాంటి అపశకునపు మాటలు మాట్లాడేవంటే. నువ్వు శకున పక్షివని అందరికీ తెలుసు. అప్పారావుకి ఏమయినా అయితే నా చికెన్ మాటేమిటి?'' అనడిగేడు వెంకటరెడ్డి విరుకోపం ప్రదర్శిస్తూ.

''శర్మగారు శకునపక్షి ఏమిటోయ్. నాకు తెలియదు. ఎందుకు మీరు అలా అంటున్నారు'' అనడిగేడు వెంకట్‌రెడ్డిని వెంకటేశ్వర్లు.

''రా! వీళ్ళంతా అనవసరంగా నాకు ఈ బిరుదును ఇచ్చేరు లెండి. ఇప్పుడెందుకు అది?'' అని దాటవేయబోయేడు శర్మ.

''అలా మొహమాటపడితే ఎలా? నేను

జరిగినవి చెబుతాను'' అని రామమూర్తి అందుకున్నాడు.

''ఇది దాదాపు పదేళ్ళ క్రితం మాట. మేం చిన్నప్పటినుంచీ స్నేహితులం. శర్మ ఇంజనీరింగ్ చదువుతూ ఏదో సందర్భంలో ప్రిన్సిపాల్‌తో తగాదా వచ్చి, అహం దెబ్బ తిని చదువు మానేసి వచ్చి కలప వ్యాపారం లోనికి దిగేడు. కలప రవాణా చేయడానికి లారీలు కావాలిగా. వాటికోసం తిరిగేటప్పు డు దగ్గరగా ఉన్న గంజ్‌లో పని చేసే ఇమ్రాన్, సత్యం, చలమయ్య, అప్పారావుల తో పరిచయం అయింది. నలుగురూ లారీలని నడిపేవారు. కలుసుకున్నప్పుడు కష్ట సుఖాలు చెప్పుకునేవారు. ఒకనాడు రాత్రి 9 గంటలకి ఒరేయ్ సత్యం ఎన్నాళ్ళు ఇలా లారీ డ్రైవరుగా పని చేసినా మనదం టూ ఒక లారీ లేకపోతే రోజుకి మన 15–20 కంటే కిట్టదు. ఒళ్ళు హూనమ యి నెల పొడుగునా పనిచేసినా నెలకి 500 – 600 కంటే ఆదాయం ఉండడంలేదు. దీనికంటే ఏ కిళ్ళీ బడ్డీయో పెట్టుకుంటే మెరుగనిపిస్తోంది'' అన్నాడు చలమయ్య.


''లారీ కొనడం అంటే మజాకానా? 25000 రూపాయలు కావాలి. లారీ కొనుక్కుని మనమే నడపగలిగితే ఎంతలేద న్నా 200 రూపాయలు కిడతాయి రోజుకి' ' అన్నాడు ఇమ్రాన్, జుత్తు ఊడిపోతున్న నుదటిని గళ్ళ రుమాలుతో తుడుచుకుం టూ.

''మన పని ఇంతే'' అన్నాడు అప్పారావు. సత్యం వంత పాడేడు.

తెల్లారింది. నలుగురూ లారీలు తీయబో తుండగా.

'బాబూ రాత్రి మీరన్నది నిజమేనా? 25000 రూపాయలు పెట్టి లారీ కొంటే రోజుకి రెండు వందలు వస్తాయా?' అనడిగే డు ఒక 60 ఏళ్ళ వ్యక్తి.

''ఉంటే ఉంటుంది. అయినా నీకెందు కు? ఏదో 25000 రూపాయలు పెట్టుబ డి పెట్టేవానిలా ఆ ప్రశ్నలు ఏమిటి?'' అని



విసుగుకున్నారు నలుగురూ.

"నా దగ్గర 25000 రూపాయలు ఉన్నాయి. దానితో లారీని కొంటాను. మీరు లారీ నడిపినందుకు సగం లాభం తీసుకుని మిగతా సగం, అదే రోజుకి వంద రూపాయలు నాకివ్వండి" అన్నాడు. ఒక్కసారి నలుగురిలో ఆసక్తి పెరిగింది. కానీ ఈ లుంగీ, మాసిన చొక్కా, పాత చెప్పులు వేసుకున్న వ్యక్తి దగ్గర 25000 రూపాయలు ఉంటాయా?" అని ఆశ్చర్యపడడం మాని.

"నా పేరు రామదాసు. బర్మా కాందిశీకుడిని. అక్కడ చేతి రిక్షా లాగే వాడిని. అవస్థలుపడి, పస్తులుండి 25000 రూపాయలు ఆదా చేసి ఈ దేశం తిరిగి వచ్చేను. ఈ డబ్బు నా దగ్గర ఉన్నట్లు నా కొడుకుకి కూడా తెలియదు. ఏదైనా లాభసాటి వ్యాపారం కలిసి వస్తే అది దానిలో పెట్టి నా కొడుకుకి ఇంత సహాయం చేద్దామని ఉంది. ఈ లారీ వ్యాపారంవలన మీకూ, నాకూ లాభమే" అన్నాడు రామదాసు.

ఒక్కసారి కథ చెప్పడం ఆపి రామమూర్తి బాత్రూంలోనికి జొరపడ్డాడు.

"ఊఁ తరువాత?" అనడిగేడు వెంకటేశ్వర్లు శర్మవేపు తిరిగి. శర్మ జవాబీయలేదు. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్న శర్మ ఒక్కసారి లేచి నిలబడి "మీరు మెల్లిగా ఈ రౌండ్ కానీయండి. రెండడుగులు వేసి అప్పరావు వస్తున్నాడేమో చూసి వస్తాను. మీరు డ్రింక్ ముగించేలోగా నేను వచ్చేస్తాను" అని తన గ్లాసులోని ద్రవంని ఒక్కసారిగా ఎత్తి పెట్టి త్రాగి వడివడిగా రెండడుగులు వేసి చీకటిలో, చెట్లలోనికి మాయమయ్యేడు శర్మ. ఏమీ భయం లేకుండా అలా చీకట్లోనికి వెళ్తున్న శర్మని చూస్తుంటే తెగ ఆశ్చర్యం కలిగింది వెంకటేశ్వర్లుకి. లోపలినుంచి రామమూర్తి తిరిగి వచ్చి అందుకున్నాడు.

'మర్నాడు అందరూ రామదాసుని తీసుకెళ్ళి లారీని కొనిపించేరు. మొదటి పది రోజులలో రామదాసుకి 100 రూపాయలు ఇచ్చేరు. మరొక వారం రోజులు గడిచేసరికి, టైర్లు కావాలి, ఇంజన్ రిపేర్ చేయించాలని ఒక ప్రక్కనుంచి ఇస్తూ రెండవ ప్రక్కనుంచి ఇచ్చిన డబ్బుని తీసేసుకుంటున్నారు. రెండు నెలలు గడిచేటప్పటికి ఆదాయం ఏమీ లేకపోవడం గమనించి ఆ నలుగురినీ పిలిచి "ఇలా అయితే లాభం లేదు. సవ్యంగా మీరు లారీ నడిపితే సరేసరి. లేకపోతే నేను కాకినాడ వెళ్ళి నా లారీని తిప్పుకుంటాను" అన్నాడు రామదాసు.

"నీ లారీ ఏమిటి, అది మా లారీ" అన్నారు నలుగురూ ముక్తకంఠంతో.

ఒక్కసారి నిశ్చేష్టుడయ్యేడు రామదాసు.

"నేను డబ్బు పెడితే లారీ మీది ఎట్లా అవుతుంది?" అనడిగేడు.

నలుగురూ కడుపుబ్బ నవ్వుకుంటూ వెళ్ళిపోయారు. ఆశ చావక బేంక్‌కి వెళ్ళి ఆరా తీయగా, 15000 రూపాయలు మాత్రం కట్టి లారీ తీసుకున్నారని మిగతా 10000 రూపాయలు కాజేసేరని, ఆ ... నలుగురి పేర్న ఉందని తెలిసి గుండెలు బాదుకుంటూ శర్మ దగ్గరికి వచ్చి మొర పెట్టుకున్నాడు రామదాసు. శర్మ ఆ నలుగురి ... పిలిచి ఇది చాలా దారుణం. తోపుడు రిక్షా

లాగి కూడబెట్టి కొడుకుకి కూడా ఇవ్వకుండా మీకిస్తే ఇలా మీరు చేయడం ఏమీ బాగులేదు. ఎంతకాయ కష్టం చేస్తే 25000 రూపాయలు వస్తాయి? ఆయన డబ్బు ఆయనకి ఇచ్చేయండి. లేకపోతే సమూలంగా నాశమయిపోతారు'' అని శర్మ ఎంత చెప్పినా వాళ్ళు వినిపించుకోలేదు.

''వెళ్ళండి పంతులుగారూ, మంత్రాలకి చింతకాయలు రావు'' అని ఈసడిస్తూ వెళ్ళేరు. పూర్తిగా కృంగిన రామదాసు పిచ్చివానిలా తిరుగుతూ వాళ్ళని శాపనార్థాలు పెట్టి ఒక వెల్లాళ్ళలో హరీ మన్నాడు.

లారీని వంతులవారీగా నడుపుతూ రెండు నెలలు గడిచేయి. ఆ రోజు ఇమ్రాన్ వంతు. లారీ నడుపుతూ నిద్ర వస్తే ట్రంక్ రోడ్డుమీద లారీని నిలిపి, లారీ క్రింద సీటు వేసుకుని నిద్రపోయేడు. అయితే నిద్రలో దొర్లడం అలవాటున్నది ఇమ్రాన్‌కి.

రాత్రి 60 మైళ్ళ వేగంతో నడుపుతున్న లారీ డ్రైవర్లకి ఇమ్రాన్ కనిపించలేదు. తెల్లవారేక ముక్కలు ముక్కలుగా ఉన్న దేహం చూసేరు అందరూ. దిగాలుగా ఉన్న మిగిలిన ముగ్గురినీ చూసి ''ఏమయింది?'' అనడిగేడు శర్మ.

'ఇమ్రాన్ చనిపోయేడు సార్' అన్నారు.

'నే చెప్పలేదా? అన్యాయం చేస్తే దాని ఫలితం...' అని చెప్పబోతుంటే.

'ఆపండి సార్ మీ నీతి. వాడికి ఈ భూమి మీద నూకలు చెల్లిపోయేయ్. వెళ్ళిపోయేడు అంతే'' అంతకన్నా ఏమీ లేదు'' అని శర్మ చెప్పేది వినకుండా వెళ్ళిపోయేరు.

అది జరిగిన రెండు నెలలకి సత్యం ఇంకెవరి లారీయో నడుపుతూ భద్రాచలం కొండలలో లారీతో సహా కూలి మరణించాడు. ఇది తెలిసిన శర్మ మిగతా ఇద్దరినీ కలిసి.

''చూసేరా నేను చెబితే వినలేదు. ఇద్దరు ఆ పాపానికి ఫలితం అనుభవించేరు. ఇప్పటికైనా మించిపోయినది ఏమీ లేదు.



## ఉద్దేశం

సోమేశం అన్నాడు రామ్మూర్తితో–

''అనుకూలవతి అయిన భార్య లభించిన ప్రతి మగవాడూ అదృష్టవంతుడేరా!''

''అంటే మగవాళ్ళలో అదృష్టవంతులుండరనేగా నీ ఉద్దేశం?'' ఠక్కున అన్నాడు రామ్మూర్తి.

–ఎం.రాధాకిషన్ (సికిందరాబాద్)

రామదాసు కుటుంబానికి వాళ్ళ డబ్బు ఇచ్చేయండి. బ్రతికిపోతారు' అని సలహా ఇచ్చారు.

"ఇచ్చేసేరా?" అనడిగేడు వెంకటేశ్వర్లు.

"లేదు" అని శర్మ లోపలికి వచ్చి ప్లేట్లలో అప్పారావు తెచ్చిన చికెన్ అమర్చిన టేబుల్ మీద ఉంచేడు. వెంకటరెడ్డి ఇహ ఆగలేదు.

'సారీ అప్పారావు సైకిలుమీద నుంచి పడ్డాడు. దెబ్బలు ఏమీ తగలలేదు. కాని చికెన్ ఇసుకులో పడింది. అందుచేత మళ్ళీ చేయించి తీసుకువచ్చేసరికి ఆలస్యమయింది. ఏమిటి వెంకటేశ్వర్లుగారి డ్రింక్ ఇంకా అవలేదే, ఎత్తి పెట్టండి" అని వెంకటేశ్వర్లుని కుదిపి, ఖాళీ చేసిన గ్లాసుని అందుకుని నాల్గవ రౌండ్ వేయడానికి ఉద్యుక్తుడయేడు శర్మ. అందరూ గ్లాసులని తిరిగి అందుకున్నారు.

"చలమయ్యకి ఆర్టిసిలో డ్రైవర్‌గా నెలకి 1300 రూపాయలతో ఉద్యోగం వచ్చింది. అప్పారావు లారీ తానొక్కడినే నడిపి లాభంలో వాటా ఇస్తాననడంతో, ఉద్యోగంలో చేరాడు చలమయ్య. కాని అది అట్టేకాలం సాగించకుండానే తగరపు వలస దగ్గర ఎదురుగా వస్తున్న లారీతో ఢీకొని అక్కడికక్కడే మరణించాడు. ఇలా అర్థాంతరంగా పూర్తిగా ఒక సంవత్సరం తిరగకుండా ముగ్గురు చనిపోవడం చూసేక గుండె బేజారయి అప్పారావు తన భార్యతో నా దగ్గరకి వచ్చి 'మమ్మల్ని రక్షించండి. మీరు ఏం చేయమంటే అది చేస్తాం' అన్నాడు.

"నేను రక్షించడమేమిటి మీరు రామదాసుకి అన్యాయం చేసేరు. అది సరిదిద్దుకోండి. ముందు నీ దగ్గర ఉన్న డబ్బంతా రామదాసు కుటుంబానికి ఇచ్చి మిగతాది త్వరలో ఇచ్చేస్తానని చెప్పండి" అని చెప్పి పంపేశాను వాళ్ళని, అని ఆగేడు శర్మ. వెంకటేశ్వర్లు జేబులోంచి రుమాలు తీసి నుదుటన పట్టిన చెమటని తుడుచుకున్నాడు

"అప్పారావు, అన్నీ అమర్చేవా? ఆ ఏర్పాట్లన్నీ చేసి వస్తాను మిగతా కధని నువ్వు పూర్తి చెయ్యి వెంకటరెడ్డి" అని శర్మ లోపలికి వెళ్ళేడు. గేస్ లైటు మెల్లిగా వెలుగుతోంది. వెంకటరెడ్డి అందుకున్నాడు.

"శర్మ చెప్పిన ప్రకారం అప్పారావు 18000 రూపాయలు తిరిగి ఇచ్చేడు. కొన్నాళ్ళు భయంతో లారీ నడపడం ఆపుచేసి తిరిగి ప్రారంభించిన నెల్లాళ్ళకి కాబోలు కడియం దగ్గర రేడియేటర్ వేడెక్కిందని లారీని ఆపు చేసి బోనెట్‌ని ఎత్తి చూస్తున్నాడు. అప్పారావు ఒక కాలు బంపర్‌మీద, ఇంకొక కాలు కొంచెం ఎత్తున ఉంది. ఎదురుగా వస్తున్న లారీ ఒకటి రోడ్డు మీద కోడిని తప్పించడానికి ప్రయత్నిస్తూ, వశం తప్పి నిలబడి ఉన్న అప్పారావుని గుద్దింది. బ్రేక్ వేసినా ఉధృతం తగ్గినా, బరువులో ఉన్న లారీ ఢీకొనడంతో బంపర్‌మీదున్న అప్పారావు ఎడమ కాలు ముక్కలయింది. కాలు తీసేశాక లారీని నడపడం వీలవక, లారీని అమ్మి రామదాసు డబ్బు రామదాసు కొడుకికి ఇచ్చి శర్మగారి గారేజ్‌లో పని

చేస్తున్నాడు'' అని కథ ముగించేడు వెంకటరెడ్డి.


శర్మ లోపలినుంచి తిరిగి వచ్చేడు. ఎక్స్పోట్ గాస్ లాంతర్‌ని ఒక్కసారి హెచ్చించగా భగ్ మని ఎర్రని మంట మీదకి ఉబికింది. శర్మ వెంకటేశ్వర్లు దగ్గరగా జరిగి.

''మనం ఎవరికీ అన్యాయం చేయకూడదు..అందులో నమ్మిన వాళ్ళని! అన్యాయం చేస్తే వాళ్ళు మనల్ని శపిస్తారు. వాళ్ళ ఉసురు మనకి కొడుతుందో లేదో తెలియదు. కాని దాని ప్రభావం మన మీద ఖచ్చితంగా ఉంటుంది. ఏమంటారు వెంకటేశ్వర్లుగారూ?'' అని అడుగుతూ వెంకటేశ్వర్లు దగ్గరగా వచ్చి భుజం మీద చేయి వేసి, తీక్షణంగా చూసేడు శర్మ. నిప్పు గోళాల్లో ఎర్రబడిఉన్న శర్మ కళ్ళని చూసేటప్పటికి వెన్నులో దడ ప్రారంభం అయింది వెంకటేశ్వర్లుకి. వీపుమీద పట్టిన చెమట. వెన్నెముక మీదనుంచి మెల్లిగా ... జారుతోంది.

వెంకటేశ్వర్లు భుజం మీద ధృఢంగా నొక్కుతూ. దక్షుని చంపటానికి వచ్చే జలాధరుడులా కన్పించేడు శర్మ. వెంకటేశ్వర్లుకి కర్ర కాలుతో టకటకమని శబ్దం చేస్తూ అప్పారావు వచ్చి నేలమీదున్న గాజుపెంకుల్ని తీయనారంభించేడు. ఒంటిలో సత్తువంతా దిగజారిపోయింది వెంకటేశ్వర్లుకి. నీరసంగా ''నువ్వు...నువ్వు... '' అన్నాడు అప్పారావును చూస్తూ.

''అవును బాబూ, నేనే అప్పారావుని, శర్మగారి గారేజీలో పని చేస్తాను'' అని గాజుముక్కలని తీసుకుని వెళ్ళిపోయేడు. దిగ్భ్రాంతి చెందేడు వెంకటేశ్వర్లు. ఒక్కసారి లోపలినుంచి వణుకు ప్రారంభం అయింది.

తెల్లవారింది. రాత్రి హెచ్చుగా తాగినందువల్ల తల దిమ్ముగా ఉంది వెంకటేశ్వర్లుకి. ఆదరాబాదరాగా తయారయి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతూ నేను వెళ్తాను శర్మగారూ. ఒక ముఖ్యమైన పని జ్ఞాపకానికి



## ఎనిమిదేళ్ళమత్తు

ఆతడి పేరు కోన్లీ హోల్‌బ్రూక్! 26 సంవత్సరాల ఈ వ్యక్తి 8 సంవత్సరాల క్రితం అమెరికాలోని నార్త్ కరోలినాలో ఎవరి చేతిలోనో దెబ్బలు తిని స్పృహ తప్పి పడిపోయాడు! అయితే మొన్నీమధ్యనే ఆతడు ఉన్నట్లుండి స్పృహలోకి వచ్చి అందర్నీ కంగారు పెట్టేశాడట! తనను కొట్టిన వారి పేర్లను కూడా పోలీసులకు చెప్పి అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తేశాడట! నిజంగా ఇది వింతైన విషయమే!

—జూపిటర్

వచ్చింది అన్నాడు.

''రెండు మూడు రోజులు సరదాగా గడుపుదామని వచ్చి మీరు ఇలా వెళ్ళిపోతావంటే నాకు అదోలా ఉంది. మేం మిమ్మల్ని ఏమీ బాధపెట్టలేదు కదా?'' అనడిగేదు శర్మ.

''అబ్బెబ్బే! అదేంకాదు. పని జ్ఞాపకానికి వచ్చింది. మరి నే బయలుదేరుతాను'' అని కారులో కూర్చుంటుండగా ''మలుపులలో జాగ్రత్త. ఎక్సిడెంట్స్ తెగ ఎక్కువ'' అని హెచ్చరించేదు శర్మ.

కారు మెల్లిగా ఘాట్ రోడ్డు మీద నుంచి వెళ్తుంటే వెంకటేశ్వర్లుకి చటుక్కున మరదలు తనూజ జ్ఞాపకాని వచ్చింది. తన దగ్గర దాచుకున్న లక్షన్నర డబ్బు లేవు పొమ్మనందుకు తనూజ తనని తిడుతూ వెళ్ళింది. శర్మ అన్నట్లు అవి నాకు హాని చేస్తాయా? పోనీ ఎందుకైనా మంచిది ఇచ్చేస్తే?

ఛఛ! లక్షన్నర! ఎంత జల్సా చేయవచ్చో ఆ డబ్బుతో! బ్రతికి ఉంటే జల్సా చేస్తావు. కాని బ్రతికుండకపోతే! అని గుండెలోని పిరికితనం కీడుని శంకిస్తోంది. ఇది కంప్యూటర్ యుగం, ఇంకా శాపాలు వగైరా! అబ్బే! అని స్థిమితపడడానికి ప్రయత్నించేదు వెంకటేశ్వర్లు. కాని 'బావా నా లక్షన్నర కాజేసిన నువ్వు బాగుపడవులే' అన్న తనూజ మాటలు చెవులో గింగురుమంటున్నాయి. మనసు అటూ ఇటూ గింజుకుంటుండగా ఎదురుగా వస్తున్న లారీని గమనించలేదు వెంకటేశ్వర్లు.

* * *

ప్రొద్దున్న 9.00 గంటలకి మిగిలిన నలుగురూ కబుర్లలో పడ్డారు. వెంకటేశ్వర్లు వెళ్ళి దాదాపు ఒక గంట అయింది. ''నువ్వు వచ్చి భుజం మీద చెయ్యి వేసేసరికి తారెత్తిపోయేదు పాపం! గిల్టీ కాన్షస్. నువ్వు చెప్పినట్లే అప్పుడు నేను గాస్‌లైటుని గట్టిగా ఊదేను. ఆ ఎరుపు మంటలో నీ కళ్ళు చూసి నాకే భయమనిపించింది'' అన్నాడు ఎక్బోటే.

''ఏంలేదు, లోపలికి వెళ్ళి రెండు కంటి డ్రాప్స్ వేసుకున్నాడు. అవి వేసుకున్నప్పుడు తాత్కాలికంగా కళ్ళు భయంకరంగా ఎర్రపడతాయి'' అని చిరునవ్వు నవ్వేదు శర్మ. నలుగురూ నవ్వుకున్నారు. అప్పారావు వచ్చి కాఫీ అందరికీ అందిచ్చాడు.

* * *

శర్మకి: ఏక్సిడెంట్‌నుంచి కోలుకున్నాక వెంకటేశ్వర్లు తన సొమ్ము తిరిగి ఇచ్చి వేసేడని తనూజ నిన్న వచ్చి చెప్పింది. ఆవిడ నీకు ప్రత్యేకంగా నమస్కారాలు చెప్పమంది.

ఉత్తరం చదివి తబ్బిబ్బయేదు శర్మ. ''ముల్లుని ముల్లుతోనే తీయాలి'' అనుకుని ఈల వేసుకుంటూ ఉత్తరాన్ని ముద్దుపెట్టుకున్నాడు.